
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 302 | శనివారం 30 ఆగస్టు 2025 | పేజీలు : 4 | వెల : 3/-




# ఈ కూటమి చాలా కాలం ఉండాలి



- సినిమా నటుల్లోనూ రగిలే అగ్నిగుండాలు ఉంటాయి: డిప్యూటీ సీఎం పవన్
- సినిమాల కంటే జనసేన పార్టీపైనే ఎక్కువ దృష్టిపెట్టా
- మన మహిళలు పేరంటాలకూ వెళ్లాలి.. పోరాటాలూ చేయాలి
- ఎన్ని కష్టాలు వచ్చినా తట్టుకుని నిలబడ్డాం కాబట్టే ప్రజలకు మేలు చేస్తున్నాం
- ప్రజలు బాగుండాలని కోరుకుంటాం..
- ఏ సిద్ధాంతాలు, నిబద్ధతతో వచ్చామో ఇప్పటికే అలాగే ఉన్నాం

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి విశాఖపట్నం**

సగటు మనిషి కోపం నుంచి పుట్టిందే జనసేన అని ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖలో నిర్వహించిన 'సేనతో సేనాని' సభలో ఆయన మాట్లాడారు. ఈ 11 ఏళ్ల ప్రయాణంలో కుటుంబం, సినిమాల కంటే జనసేన పార్టీపైనే ఎక్కువ దృష్టిపెట్టానని తెలిపారు. అందుకే వందశాతం స్ట్రైక్ రేట్‌తో దేశంలోనే చరిత్ర సృష్టించామన్నారు. తగిలిన ఎదురు దెబ్బలు మరింత రాటుదేల్చాయి.. ఎన్ని కష్టాలు వచ్చినా తట్టుకుని నిలబడ్డాం కాబట్టే ప్రజలకు మేలు చేస్తున్నామని తెలిపారు. వీరమహిళల సేవలను ఎప్పటికీ మరచిపోలేమన్నారు. ఏ సిద్ధాంతాలు, నిబద్ధతతో వచ్చామో ఇప్పటికే అలాగే ఉన్నామని చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి సభకు వచ్చిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. "కులం, కుటుంబం, రాష్ట్రం, ప్రాంతం కోసం పెట్టిన పార్టీ కాదు మనది. ఉద్దానం కిడ్నీ బాధితుల - మిగతా3లో

## రాయలసీమను రాళ్ల సీమ కానివ్వను..

# రతనాల సీమ చేస్తా



- ప్రపంచంలో ఉన్న టెక్నాలజీనంతా కుప్పంకు తెస్తా
- సీమకు నీళ్లు తెచ్చేందుకు సంకల్పం తీసుకున్న ఏకైక నాయకుడు ఎన్టీఆర్
- కుప్పం నుంచి ఏడు సార్లు గెలిపించిన ప్రజలను మరచిపోను
- అబద్దాల చెప్పడంలో వైసీపీ దిట్ట
- పరమసముద్రంలో బహిరంగ సభలో కుప్పం ప్రజలను ఉద్దేశించి ప్రసగించిన సీఎం

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి కుప్పం**

రాయలసీమను రాళ్ల సీమ కానివ్వనని.. రతనాల సీమ చేస్తానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. కృష్ణా జలాలను 738 కిలో మీటర్ల మేర కాలువలద్వారా కుప్పం పరమసముద్రానికి తెచ్చారు. ఈ సందర్భంగా శనివారం అక్కడ జలహారతి ఇచ్చే కార్యక్రమంలో సీఎం పాల్గొని రైతులతో ముట్టడించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. ధవళేశ్వరం, ప్రకాశం బ్యారేజీల నిర్మాణంతో గోదావరి, కష్ణా, గుంటూరు జిల్లాల పరిస్థితి మారింది. అందుకే శతాబ్దాలు గడిచినా... కాటన్ దొరను గోదావరి ప్రజలు ఇంకా మరువలేదు. అలాగే రాయలసీమకు నీళ్లు తెచ్చేందుకు సంకల్పం తీసుకున్న ఏకైక నాయకుడు ఎన్టీఆర్. పశువులను కాపాడుకోవడానికి రైళ్లల్లో నీళ్లు తెప్పించాల్సిన దారుణమైన కరవు రాయలసీమలో ఉండేది.. అప్పుడే చాలా బాధపడ్డాను.. ఈ పరిస్థితి మార్చాలనుకున్నా. అందుకే 1999లో హంద్రీ%-%నీవాకు శంకుస్థాపన చేశాను. శ్రీశైలం మల్లన్న దగ్గరున్న జలాలను కుప్పం మల్లన్న వద్దకు చేర్చాం. 2014%-%19 మధ్య కాలంలో రాయలసీమ ప్రాజెక్టుల కోసం రూ.12,500 కోట్లు ఖర్చు పెట్టాం. 2019%-%24 మధ్య కాలంలో సీమ ప్రాజెక్టుల కోసం రూ. 2000 కోట్లు కూడా ఖర్చు పెట్టలేదు. సెట్టింగులు వేశారు.. - మిగతా3లో

# రిజర్వేషన్ల కోటా పరిమితి ఎత్తివేత



- సెప్టెంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు..
- తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు
- వర్షాల వల్ల జరిగిన నష్టం అంచనాల పై సెప్టెంబర్ 4న ఉన్నతాధికారుల సమావేశం నిర్వహిస్తాం
- రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో పెట్టి ఆమోదిస్తాం
- గోశాలల పాలసీ విధి విధానాలపై చర్చించాం
- ఎన్నికల కమిషన్‌కు తెలంగాణ ప్రభుత్వం లేఖ
- అసెంబ్లీ బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టబోతున్నాం

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్**

తెలంగాణ కేబినెట్ పలు నిర్ణయాలు తీసుకుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గోశాల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ.. జీవో ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్న పొంగులేటి.. రిజర్వేషన్ల కోటా పరిమితి ఎత్తివేసినట్లు చెప్పారు. రిజర్వేషన్ల బిల్లులను గతంలో ఆర్డినెన్స్ ద్వారా గవర్నర్‌కు పంపామని.. ఆదివారం అసెంబ్లీలో బిల్లులు పెట్టి ఆమోదిస్తామని - మిగతా3లో

# క్రెడిట్ కొట్టేయగల సమర్థుడు చంద్రబాబు



- కుప్పానికి, రాయలసీమకు నీళ్లు ఇవ్వాలనే ఆలోచన చంద్రబాబుకి ఏనాడూ రాలేదు
- ఆయన ఆడే నాటకాలు, మోసాలు జనాలకు బాగా తెలుసు

**గుంటూరు**

కుప్పానికి, రాయలసీమకు నీళ్లు ఇవ్వాలనే ఆలోచన చంద్రబాబుకి ఏనాడూ రాలేదని.. ఆయన ఆడే నాటకాలు, మోసాలు జనాలకు బాగా తెలుసుని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శనివారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్రకార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. సొమ్మొకడిది.. సోకొకడిది అన్నట్లు ఉంది చంద్రబాబు వ్యవహారం. పని చేసేది ఒకరు.. క్రెడిట్ పొందేది మరొకరు. క్రెడిట్‌ను దొంగిలించగలిగిన సమర్థుడు చంద్రబాబు ఆరితేరారు. కుప్పానికి మొన్న నీళ్లు ఇచ్చానని చంద్రబాబు చెబుతున్నారు. కానీ, 1989 - మిగతా3లో

# ఎజెండా కూడా చెప్పడం లేదు



- ప్రజా సమస్యలు, రైతు సమస్యలపై ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదు.
- వరదల మీద మాట్లాడుదాం అంటే.. బురద రాజకీయాలు మాట్లాడుకుందాం అంటున్నారు
- వరదలు, ఎరువుల మీద చర్చించాలని బీఏసీ సమావేశంలో మేం కోరాం
- రెండే రోజులు అసెంబ్లీ జరిపి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పారిపోవాలని చూస్తుంది
- గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సరిగా లేక వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు.
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

# ఈ కూటమి చాలా కాలం ఉండాలి

-మొదటిపేజీ తరువాయి

సమస్యలు పరిష్కరించాం. ఏజెన్సీలో డోలీ మోతలు చూసి నా హృదయం ద్రవించింది. ప్రజల కష్టాలు పరిష్కరించినప్పుడు నా నిర్ణయం సరైందే అనిపించింది. పదేళ్లపాటు నన్ను నేను పరీక్షించుకుని పార్టీ పెట్టా. చిన్న సమస్యలు వచ్చాయని అనేకమంది పారిపోయారు. ఐడియాలజీ ఉన్నవారే ఇప్పటికీ నాతో నడుస్తున్నారు. ఏ భావన, ఆలోచన లేకుండానే పార్టీలు పెట్టేస్తామా? నిస్వార్థంగా పనిచేస్తున్నాం.. మంచి ఫలితాలే వస్తున్నాయి. 2019-24 మధ్య మనల్ని అనేక రకాల బాధలు పెట్టారు. అయినా ప్రధాని, హోంమంత్రిని సాయం అడగలేదు. ఆనాడు కేంద్ర పెద్దల సాయం అడిగేకంటే పార్టీ మూసుకోవడం మంచిదనుకున్నా.

మన మహిళలు పేరంటాలకూ వెళ్లాలి.. పోరాటాలూ చేయాలి. ప్రజలు బాగుండాలని కోరుకుంటాం.. ఎంతవరకైనా వెళ్తాం. జనసేన భవిష్యత్తును ప్రజలు చూశారు. సినిమా నటుల లోపల కూడా రగిలే అగ్నిగుండాలు ఉంటాయి. కమ్యూనిస్టు, సోషలిస్టు అనే చైనా, రష్యా రాజకీయాల్లో అనేక మార్పులు వచ్చాయి. ఇస్లామిక్ సిద్ధాంతాలు పాటించే అరబ్ దేశాల్లోని మహిళలకు డ్రైవింగ్ హక్కులు కూడా వచ్చాయి. మనుషులు, సిద్ధాంతాలకు కాలగమనంలో మార్పులు తథ్యం. నేను విప్లవ పంథాలోకి వెళ్లలేదు.. తుపాకులు పట్టుకోలేదు. ప్రజాస్వామ్య సమాజాల్లో హింసావాదంతో ఏమీ సాధించలేం. దసరా తర్వాత త్రిశూల్ కార్యక్రమం ప్రారంభిస్తున్నాం. ప్రతి క్రియాశీల సభ్యుడు.. పార్టీ సెంట్రల్ కమిటీ నేతలతో అనుసంధానం అయ్యేలా కమిటీ వేస్తాం. రాజకీయాలంటే.. వ్యాపారం, డబ్బు సంపాదించడం కాదు" అని పవన్ కల్యాణ్ అన్నారు.

**సగటు మనిషి కోపం నుంచే జనసేన పుట్టింది**

'కులం, కుటుంబం, రాష్ట్రం, ప్రాంతం కోసం పెట్టిన పార్టీ కాదు మనది. ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యలు పరిష్కరించాం. ఏజెన్సీలో డోలీ మోతలు చూసి నా హృదయం ద్రవించింది. ప్రజల కష్టాలు పరిష్కరించినప్పుడు నా నిర్ణయం సరైందే అనిపించింది. 2019-24 మధ్య మనల్ని అనేక రకాల బాధలు పెట్టారు. అయినా ప్రధాని, హోంమంత్రిని సాయం అడగలేదు. ఆనాడు కేంద్ర పెద్దల సాయం అడిగేకంటే పార్టీ మూసుకోవడం మంచిదనుకున్నా.' అని పవన్ కళ్యాణ్ తన సేనని ఉద్దేశించి మాట్లాడారు.




'సేనతో సేనాని' పేరిట జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశాల్లో భాగంగా నేడు విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు ప్రాంగణం(ఇందిరా ప్రియదర్శిని స్టేడియం) లో జరుగుతున్న బహిరంగ సభలో పవన్ పార్టీ జనసైనికుల్ని ఉద్దేశించి ప్రసంగించారు. నాయకుడు అనేవాడు కిందనుంచే రావాలని పవన్ ఈ సందర్భంగా అన్నారు. నిస్వార్థంగా పనిచేస్తున్నాం, మంచి ఫలితాలే వస్తున్నాయని పవన్ తెలిపారు. 'నోవాటెల్ హొటల్ లో అక్రమ అరెస్టులు చేశారు. కేంద్రానికి ఒక్క ఫోన్ కూడా చేయలేదు. సహాయం అడిగితే.. నేను పార్టీ మూసుకొని వెళ్లాల్సిందే. నేను, వీర సైనికులు ఏదురొడ్డి నిలబడ్డాం. జనసేన బలోపేతానికి రానున్న రోజుల్లో మెంబర్‌షిప్ , లీడర్ షిప్‌తో ముందుకు వెళ్తాం. నాయకులు కింద నుంచి రావాలి. త్రిశూల్ ప్రోగ్రాం దసరా తర్వాత ప్రారంభిస్తాం.'అని పవన్ చెప్పారు.

**ఈ కూటమి చాలా కాలం ఉండాలి..**

2030 నాటికి అనేకమంది బలమైన నాయకులను తయారు చేస్తాని పవన్ కల్యాణ్ తెలిపారు. "క్షేత్ర స్థాయిలో ఉండే వీర మహిళలకు 33శాతం పదవులు ఇస్తాం. క్రమశిక్షణ, అంకితభావం, స్థిరత్వం.. ఇవే మిమ్మల్ని ముందుకు తీసుకెళతాయి. పార్టీ క్రియాశీల సభ్యులకు ప్రమాదబీమా కల్పిస్తున్నాం. కార్యకర్తలకు భద్రత, సంక్షేమం, గౌరవం దిశగా ఆలోచన చేస్తున్నాం. సభ్యత్వం తీసుకున్నాక అనేక విభాగాల్లో ఎదిగేలా ప్రోత్సహిస్తాం. మీరు నిలబడడానికి సిద్ధంగా ఉంటే నడిపించడానికి సిద్ధంగా ఉన్నా. జనసైనికులు దశాబ్దకాలం నాకు ఇవ్వండి నాయకులుగా మారుస్తా. రాష్ట్రానికి 15 ఏళ్ల పాటు బలమైన రాజకీయ స్థిరత్వం కావాలి. ఈ కూటమి చాలా కాలం ఉండాలి. చిన్నపాటి సమస్యలు ఉంటే మాట్లాడుకుని సరిద్దుకుందాం. మనం బలహీనపడితే మళ్లీ అరాచకపాలన వస్తుంది" అని పవన్ అన్నారు.

## చెన్నై, హైదరాబాద్.., బెంగళూరు ఇక 2 అవర్స్...

# అమరావతి నుంచి కొత్త లైన్లు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, హైదరాబాద్ మధ్య బుల్లెట్ రైళ్లు పరుగులు తీయనున్నాయి. హైదరాబాద్- చెన్నై మధ్య హైస్పీడ్ ఎలివేటెడ్ రైలు కారిడార్ నిర్మాణానికి సంబంధించిన ఎలైన్‌మెంట్‌కు ప్రాథమిక ఆమోదం లభించింది. ఈ కారిడార్ అమరావతిని చేరుకుంటూ, సీఆర్డీయే మీదుగా వెళ్తుంది. ఇదే విధంగా, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల మీదుగా వెళ్లే హైదరాబాద్- బెంగళూరు హైస్పీడ్ రైలు కారిడార్ ఎలైన్‌మెంట్‌కూ ప్రాథమిక ఆమోదం లభించింది. ఈ రెండు రైలు మార్గాల నిర్మాణంతో తెలుగు రాష్ట్రాల్లో ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది.మెట్రో నగరాల మధ్య బుల్లెట్ రైళ్లు నడిపేందుకు కేంద్ర ప్రభుత్వం హైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్లను నిర్మిస్తున్నది. ఈ ప్రాజెక్టులో భాగంగా, హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ కారిడార్, హైదరాబాద్-బెంగళూరు కారిడార్లు ఏపీ మీదుగా వెళ్తాయి. ఈ రెండు కారిడార్లు ప్రారంభంలో హైదరాబాద్ నుంచి శంషాబాద్ వరకు 38.5 కిలోమీటర్ల వరకూ ఒకే మార్గంలో వెళ్తాయి. అనంతరం, చెన్నై, బెంగళూరు వైపుగా విడిపోయే వేర్వేరు మార్గాలుగా సాగుతాయి.హైదరాబాద్- చెన్నై హైస్పీడ్ కారిడార్ కోసం 839.5 కి.మీ, 749.5 కి.మీ, 744.57 కి.మీలతో 3 ప్రతిపాదిత మార్గాలను పరిశీలించారు. వీటిలో అతి తక్కువ దూరమైన 744.5 కి.మీ. మార్గాన్ని ఎలైన్‌మెంట్‌కు ప్రాథమికంగా ఖరారు చేశారు. ఈ కారిడార్‌లో తెలంగాణలో 6, ఆంధ్రప్రదేశ్‌లో 8, తమిళనాడులో 1 స్టేషన్ నిర్మించనున్నారు. ఏపీలో ప్రతిపాదిత స్టేషన్లు అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, నాయుడుపేట, తడ ఉన్నాయి.ఈ మార్గం హైదరాబాద్‌లో ప్రారంభమై అటు నుంచి శంషాబాద్, నార్కట్‌పల్లి, సూర్యాపేట, ఖమ్మం/కోదాడ మీదుగా అమరావతి ప్రాంతానికి చేరుకుని, అక్కడి నుంచి గుంటూరు వైపు సాగుతుంది. గుంటూరు తర్వాత చీరాల వైపు వెళ్తూ, విజయవాడ - చెన్నై రైల్వే లైన్‌కు సమాంతరంగా చెన్నై వరకు వెళ్లేలా కారిడార్ నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టులో అత్యధికంగా ఏపీలో 448.11 కి.మీ, తరువాత తెలంగాణలో 236.48 కి.మీ, తమిళనాడులో 59.98 కి.మీ మేర రైలు మార్గం ఉండనుంది.ఈ కారిడార్‌ను తిరుపతి మీదుగా మళ్లిస్తే ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలుగుతుందని ప్రాథమికంగా చర్చ జరిగింది. గూడూరు



నుంచి తిరుపతి మీదుగా మారిస్తే, కారిడార్ పొడవు అదనంగా 53.5 కి.మీ దూరం పెరుగుతుంది. ఈ మార్పుతో నాయుడుపేట, తడ స్టేషన్లు మార్గంలో ఉండకపోవచ్చు. మొత్తం హైస్పీడ్ ట్రాక్ నిర్మాణంలో డబుల్ ట్రాక్, లూప్‌లైన్లు, సైడింగ్స్ కలిపి మొత్తం 1,419.4 కి.మీ వరకు ట్రాక్ నిర్మించాల్సి ఉంటుంది.హైదరాబాద్-బెంగళూరు హైస్పీడ్ కారిడార్‌కు సంబంధించి మూడు ప్రతిపాదిత మార్గాలు 621.8 కి.మీ, 576.6 కి.మీ, 558.2 కి.మీలను పరిశీలించారు. వీటిలో 576.6 కి.మీ మార్గం అత్యుత్తమంగా భావించి ఎలైన్‌మెంట్‌కు ప్రాథమికంగా ఆమోదం లభించింది. ఈ మార్గం ప్రస్తుత హైదరాబాద్- బెంగళూరు హైవేకి చాలావరకు సమాంతరంగా ఉంటుంది. ఈ కారిడార్‌లో తెలంగాణలో 4, ఆంధ్రప్రదేశ్‌లో 6, కర్ణాటకలో 3 స్టేషన్లు నిర్మించనున్నారు. ఏపీలో ప్రతిపాదిత స్టేషన్లు కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, దుద్దేబండ, హిందూపురం ఉన్నాయి. ఈ మార్గంలో తెలంగాణలో 218.5 కి.మీ, ఏపీలో 263.3 కి.మీ, కర్ణాటకలో 94.80 కి.మీ మేర రైలు మార్గం ఉంటుంది. డబుల్ లైన్, లూప్‌లైన్లు, సైడింగ్స్ కలిపి మొత్తం 1,363 కి.మీ మేర ట్రాక్ నిర్మించనున్నట్లు ఎలైన్‌మెంట్‌లో పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని పెనుకొండ సమీపంలో ఉన్న కియా పరిశ్రమ, అనుబంధ పరిశ్రమల నేపథ్యంలో దుద్దేబండ వద్ద ప్రత్యేకంగా స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఉంది.

హైదరాబాద్- అమరావతి- చెన్నై హై స్పీడ్ రైలు కారిడార్, హైదరాబాద్- బెంగళూరు మధ్య బుల్లెట్ రైళ్ల కారిడార్లు పూర్తవడంతో పాటు బెంగళూరు- చెన్నై మధ్య చేపట్టే బుల్లెట్ రైలు కనుక అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి అమరావతికి.. అమరావతి నుంచి చెన్నై, బెంగళూరు నగరాల మధ్య బుల్లెట్ రైళ్ల చతుర్భుజి ఏర్పాటు అవుతుంది. తద్వారా ఈ నగరాల మధ్య ప్రయాణం గంట నుంచి రెండు గంటల్లోనే పూర్తవుతుంది.

# విశాఖలో గూగుల్ డేటా సెంటర్

**విశాఖపట్టణం :** ప్రముఖ దిగ్గజ సంస్థ గూగుల్ ఇప్పుడు వైజాగ్‌లోనూ అడుగుపెట్టనుంది. సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడితో 1 గిగావాట్ డేటా సెంటర్ విశాఖపట్నంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. అంతేనా.. ఆసియా ఖండంలోనే ఇది అతిపెద్ద హైపర్‌స్కేల్ డేటా సెంటర్ కానుంది. గూగుల్ సంస్థ అమెరికా వెలుపల ఏర్పాటు చేసే అతిపెద్ద కేంద్రానికి సైతం విశాఖ వేదిక కానుంది. ఈ మేరకు గూగుల్‌కు చెందిన ఇన్వెస్ట్ ఇండియా ఎక్స్‌లో వెల్లడించింది. గూగుల్ ప్రతిపాదన గేమ్ ఛేంజర్ కానుంది. ప్రపంచానికి డిజిటల్ హబ్‌గా దేశానికి గుర్తింపు వస్తుందని జాతీయ పెట్టుబడుల ప్రోత్సాహక, సమన్వయ సంస్థ ఇన్వెస్ట్ ఇండియా తన ప్రకటనలో పేర్కొంది. ఇన్వెస్ట్ ఇండియా ప్రకటనలో ఇప్పుడు యావత్ ప్రపంచం ఫోకస్ ఏపీపై నిలిచింది. గూగుల్ క్లౌడ్, సెర్చ్, యుట్యూబ్, ఏఐ వర్క్‌ల పర్యావరణ వ్యవస్థ బలోపేతం చేసేందుకు ఈ డేటా సెంటర్ ఉపయోగపడనుంది. అంతేకాకుండా పరిశ్రమలు, స్టార్టప్‌లు, ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా ఏఐ సేవలను అందుబాటులోకి తీసుకురానుంది.విశాఖలో త్వరలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్.. దేశానికి చెందిన మొత్తం డేటా నిల్వ చేయనుంది. దీనివల్ల ఉగ్రమూక చేతిలోకి విలువైన డేటా చేరే అవకాశం తప్పుతుంది. అంతర్జాతీయ బ్యాండ్‌విడ్త్‌ను పెంచేందుకు 3 సబ్ మెరైన్ కేబుల్స్‌కు సరిపడా ల్యాండింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి డేటా సెంటర్‌ను అనుసంధానిస్తుంది. ముంబయిలో గూగుల్‌కు చెందిన పియరింగ్, క్యాచీ సర్వర్లు ఉన్నాయి. అక్కడి నుంచి సముద్ర మార్గంలో కేబుల్ తీసుకోవడం సులువు అవుతుంది. డార్క్ ఫైబర్ ద్వారా తక్కువ ఖర్చుతో తీసుకోవాలని ప్రణాళికలు వేస్తున్నారు. డేటా సెంటర్ కూలింగ్ కోసం పెద్దఎత్తున నీరు అవసరం అవుతుంది. అందుకే డేటా సెంటర్ ఏర్పాటు కోసం గూగుల్ విశాఖ సముద్ర తీరాన్ని ఎంపిక చేసుకుంది.పైగా ఐటీ రంగంలో రూ.2 కోట్ల పెట్టుబడి పెడితే ఒకరికి ఉపాధి లభిస్తుందని అంచనా. ఆ లెక్కన గూగుల్ సంస్థ పెట్టే సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడుల ఆధారంగా రాష్ట్రంలోని సుమారు 25 వేల మంది నిరుద్యోగులకు దశలవారీగా ప్రత్యక్ష ఉపాధి అవకాశం లభించనుంది. ఇక పరోక్షంగా మరో 50 వేల మందికి ఉపాధి లభించనుంది. అంతేకాకుండా డేటా సెంటర్ కోసం పునరుత్పాదక విద్యుత్‌ను వినియోగించాలని గూగుల్ నిర్ణయించింది. ఆ విద్యుత్ ప్రాజెక్టుల కోసం సుమారు రూ.20 వేల కోట్లు గూగుల్ ఖర్చు చేయనుంది. సముద్ర తీరం వెంట చిన్న హైడ్రో ప్రాజెక్టులు ఏర్పాటు చేసి, వాటి ద్వారా వచ్చే విద్యుత్‌ను గూగుల్ వినియోగించుకోనుంది.

## రాయలసీమను రాళ్ల సీమ కానివ్వను.. రతనాల సీమ చేస్తా

-మొదటిపేజీ తరువాయి

గేట్లు తెచ్చారు.. నీళ్లు కూడా బయట నుంచే తెచ్చి.. విడుదల చేసినట్లు మభ్య పెట్టారు. విమానం ఎక్కేలోగానే నాడు విడుదల చేసిన నీరు ఆవిరైపోయింది. అబద్ధాల చెప్పడంలో వైసీపీ దిట్ట. అసాధ్యాన్ని సుసాధ్యం చేయడం ఎన్టీఏ వల్లే సాధ్యం. ఇప్పుడు కుప్పానికి నీళ్లు రాగానే జీర్ణించుకోలేకపోతున్నారు. బయట నుంచి నీళ్లు తెచ్చి మభ్యపెట్టడం వైసీపీకి అలవాటు. చెరువులను నీళ్లతో నింపడం మాకు అలవాటు. కుప్పం నుంచి నన్ను 8 సార్లు గెలిపించారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి టీడీపీనే కుప్పం ప్రజలు గెలిపించారు.. మీ రుణం తీర్చుకుంటాను. కుప్పంలో నూటికి 80 శాతం ఓట్లు తెలుగుదేశానివే. ప్రశాంతంగా ఉండే కుప్పంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించారు. కుప్పంలో రప్పా రప్పా రాజకీయం చేయాలనున్నారు. కానీ పులివెందుల, ఒంటిమిట్టలో రప్పారప్పా రాజకీయం అంటే ఏమిటో అక్కడి ప్రజలు చూపించారు. కుప్పంలోని అన్ని చెరువులను నింపుతున్నాం. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పరమసముద్రం చెరువు నిజమైన సముద్రంలా కన్పిస్తోంది. హంద్రీ%-%నీవా ద్వారా 6 లక్షల ఎకరాలకు నీరందించగలం అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

## క్రెడిట్ కొట్టేయగల సమర్థుడు చంద్రబాబు

-మొదటిపేజీ తరువాయి

నుంచి ఆయనే అక్కడ పోటీ చేస్తున్నారు. కుప్పానికి 2024 ఫిబ్రవరి 26న జగన్ నీళ్లు ఇచ్చారు. కానీ, చంద్రబాబు లైనింగ్ పేరిట సీఎం రమేష్ కంపెనీకి అప్పనంగా డబ్బులు ఇచ్చారు.. ప్రపంచంలోనే పోలవరం చాలా క్లిష్టమైన ప్రాజెక్టు. అలాంటి ప్రాజెక్టును చంద్రబాబు తన హయాంలో గాలికి వదిలేశారు. రెండు కాపర్‌డ్యామ్‌లను 2018లో ప్రారంభించారు. వాటి జీవిత కాలం మూడేళ్లు మాత్రమే. డయాఫ్రం వాల్ కొట్టుకుపోవడానికి చంద్రబాబే కారకుడు. ఆయన చేసిన పనికి అంతర్జాతీయ నిపుణులే తలలు పట్టుకున్నారు. పోలవరం నాశనం చేసింది ముమ్మాటికీ చంద్రబాబే.

పోలవరం ప్రాజెక్టుపై చంద్రబాబు, రామానాయుడు పచ్చి అబద్ధాలు చెబుతున్నారు

చంద్రబాబు, రామానాయుడు పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. ఆయన రామా నాయుడా? డ్రామా నాయుడా?. సరైన, సక్రమ పద్ధతుల్లో పోలవరం నిర్మాణం జరగడం లేదు. డయాఫ్రం వాల్ 1.5 మీటర్ల వెడల్పు ఉండాలి. రాక్ తగిలే వరకు డయాఫ్రం వాల్ వేయాలి. కానీ, చంద్రబాబు నాయకత్వంలో 0.9 మీటర్లు మాత్రమే వేస్తున్నారు. కమీషన్ల కోసం చంద్రబాబు కక్కుర్తి పడుతున్నారు. పోలవరం ప్రాజెక్టుపై అనుమానాలకు ప్రధాన కారకుడు చంద్రబాబు. ఆయన అంతర్జాతీయ నిపుణుల సలహాలు కూడా వినడం లేదు. పోలవరం ప్రాజెక్టుపై మేం చర్చకు సిద్ధం.. ఇది సవాల్ కాదు చర్చకు రావాలని చంద్రబాబును రిక్వెస్ట్ చేస్తున్నా" అని అంబటి అన్నారు.

## సెప్టెంబరు 18 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు



**నర్సీపట్నం:** తిరుపతిలో సెప్టెంబరు 14, 15 తేదీల్లో మహిళా ఎమ్మెల్యేలకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో మీడియాకు విడుదల చేసిన వీడియోలో ఈ వివరాలు వెల్లడించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల పరిధిలో ఉన్న వివిధ పార్టీలకు చెందిన సుమారు 300 మంది మహిళా ఎమ్మెల్యేలు సదస్సుకు హాజరు కానున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి తొలిరోజు సీఎం చంద్రబాబు, లోక్‌సభ స్పీకర్ హాజరవుతారని, ముగింపు రోజున గవర్నర్ హాజరుకానున్నారని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. సదస్సుకు హాజరయ్యే ఎమ్మెల్యేలకు శ్రీవారి దర్శనం కల్పించించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సెప్టెంబరు 18 నుంచి శాసనసభ సమావేశాలు జరగుతాయని, ఈమేరకు ఎమ్మెల్యేలకు సమాచారం పంపించినట్టు పేర్కొన్నారు.

## సింహాచలం, అన్నవరంలో టెంపుల్ టూరిజం అభివృద్ధి చేస్తాం

**విశాఖపట్నం:** వైకాపా ప్రభుత్వ హయాంలో పర్యాటక రంగం పడకేసిందని ఏపీ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని, దానికి పారిశ్రామిక హోదా కూడా ఇచ్చామన్నారు. విజయవాడలో పీపీపీ విధానంలో పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. విశాఖ నగరంలోని అప్పుఘర్‌లో అభివృద్ధి చేసిన హరిత హోటల్స్‌ని ఎంపీ శ్రీభరత్, మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. "విశాఖపట్నంలో పెద్ద హోటల్స్ వస్తున్నాయి. ఇక్కడి పర్యాటక ప్రాంతాలను అప్‌గ్రేడ్ చేస్తాం. ఇప్పటికే విశాఖలో డబుల్ డెక్కర్ బస్ సేవలు మొదలు పెట్టాం. కడపలో గండికోటని అభివృద్ధి చేస్తాం. సింహాచలం, అన్నవరంలో టెంపుల్ టూరిజం అభివృద్ధి చేస్తాం. వైకాపా హయాంలో రుషికొండలో హరిత రిసార్టులు కూలగొట్టి రూ.400 కోట్లతో ప్యాలెస్‌లు కట్టారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు" అని దుర్గేశ్ విమర్శించారు. విశాఖ సముద్రంలో ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్మాణం ఓ అనాలోచిత నిర్ణయమని ఎంపీ శ్రీభరత్ అన్నారు. వైకాపా హయాంలో పెద్దఎత్తున ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. విశాఖలో 'యాత్రి నివాస్' ద్వారా పర్యాటకులకు మేలు జరుగుతుందన్నారు. రూ.13.5 కోట్లతో హరిత హోటల్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు.

## ఆర్థిక ఇబ్బందులు తప్పవా...


**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సాధించాల్సిన నిధులు ఇప్పటికే తెచ్చేసుకున్నారు. తొలి ఏడాదిలోనే అవసరమైన నిధులకు సమీకరణకు కేంద్ర ప్రభుత్వం సహకరించింది. అయితే రానున్న కాలంలో చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనకు వెళ్లినా అనుకున్న స్థాయిలో నిధులు వచ్చే అవకాశాలు లేవన్నది ఉన్నతాధికారుల నుంచి అందుతున్న సమాచారం. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకత్వం ఫోకస్ అంతా బీహార్ పైనే ఉంది. బీహార్ లోనూ, వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడుపైన ఎక్కువ దృష్టి పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీహార్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ కు ఇప్పట్లో ఎన్నికలు లేకపోవడంతో పాటు ఇప్పటికే చంద్రబాబు అడిగినంత మేరకు ఆర్థిక సాయం చేయడమే కాకుండా అవసరమైన రుణ సదుపాయాన్ని కూడా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ ఇప్పుడు బీజేపీకి చంద్రబాబు ప్రయారిటీ కాదన్నది రాజకీయంగా వాస్తవం. చంద్రబాబు నాయుడు కూటమిలోనే ఉన్నందున ఆయన వల్ల రాజకీయంగా ఇబ్బందులు తలెత్తవని కూడా బీజేపీ నేతలు భావిస్తున్నారు. అందుకే విశాఖ స్టీల్ ప్లాంట్ లోని 34 విభాగాల్లో ప్రయివేటీకరణకు సిద్ధమయిందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో జోరుగా వినిపిస్తున్నాయి. దీంతో పాటు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన నిధుల విడుదలలో కూడా కేంద్ర ప్రభుత్వం ఇక పెద్దగా ఆసక్తి చూపదని చెబుతున్నారు. ఇప్పటికే చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వం సహకారం ఉంటుందని భావించి సంక్షేమ పథకాలను గ్రౌండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో లక్షల కోట్లు అప్పులు చేశారు. ఎఫ్ఆర్ఎంబీ పరిమితికి మించి అప్పులు చేశారన్న ఆరోపణలు కూడా విపక్ష వైసీపీ నేతలు చేస్తున్నారు. అదే సమయంలో ఇక ప్రతి నెలా సంక్షేమ పథకాలను అమలు చేయాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఆంధ్రప్రదేశ్ లో ఆదాయం కంటే హామీలకు అవసరమైన నిధుల అవసరం ఎక్కువ కావడంతో ఇక రానున్న కాలంలో ఆర్థిక పరమైన ఇబ్బందులు తప్పవన్న కామెంట్స్ అధికారిక వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఇటీవల ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో చంద్రబాబు సమావేశమయినప్పటికీ ఆశించిన స్పందన లేదని అంటున్నారు. మొత్తం మీద చంద్రబాబు నాయుడుకు రానున్న కాలం ఖజానాను నింపడం, వెల్ఫేర్ స్కీమ్స్ ను కొనసాగించడం కత్తిమీద సాము వంటిదేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

# జి.ఎస్.డబ్ల్యు.ఎస్ అంశాల పెండింగ్ ను త్వరితగతిన పూర్తి చేయాలి.

## - : వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి.

**అంకుశం న్యూస్ అనంతపురం, ఆగస్టు 30 :** అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోజి.ఎస్.డబ్ల్యు.ఎస్ అంశాల పెండింగ్ ను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జి.ఎస్.డబ్ల్యు.ఎస్, తదితర అంశాలపై ఎంపీడీవోలు, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలు (జి.ఎస్.డబ్ల్యు.ఎస్) అంశాలలో భాగంగా కౌశలం సర్వేకి సంబంధించి జిల్లాకు 1,14,145 మంది సర్వే చేపట్టాలని లక్ష్యం కేటాయించగా, ఇప్పటివరకు 44,292 మంది సర్వే పూర్తి చేయగా, ఇంకా పెండింగ్ ఉన్న 69,853 మంది సర్వేని రోజుకు 10,000 చొప్పున లక్ష్యం నిర్దేశించుకుని వేగవంతంగా చేపట్టాలన్నారు. తల్లికి వందనం పేమెంట్ పెయిల్యూర్ రిపోర్ట్ కి సంబంధించి పెండింగ్ ఉన్న ఆధార్ మ్యాపింగ్ ను పూర్తి చేయాలన్నారు. తల్లికి వందనం సంబంధించి మదర్, చైల్డ్ ఈకేవైసీ పెండింగ్



ను, గ్రీవెన్స్ పెండింగ్ ను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. మన మిత్ర క్యాంపెయిన్ లో హౌస్ హోల్డ్ పెండింగ్ కు సంబంధించి రోజువారి పురోగతిని మరింత పెంచాలన్నారు. సిటిజన్స్ ఈ కేవైసీ రిపోర్ట్, ఆధార్ సీడింగ్ ఫర్ వాహన్ డేటా, ఏపీ సేవా సర్వీసెస్ చార్జెస్ పెండింగ్ ను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్ పూర్తిగా నమోదయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో



జి.ఎస్.డబ్ల్యు.ఎస్ కోఆర్డినేటర్ ధనుంజయ్, ఈ డిస్ట్రిక్ మేనేజర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

# ఊపిరి ఉన్నంతవరకు పెనుకొండ ప్రజలకు రుణపడి ఉంటాం








- పరిటాల రవీంద్ర విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పరిటాల సునీత, శ్రీరామ్
- చరిత్రలో ఎప్పటికీ పరిటాల రవి పేరు వినపడుతుందన్న మంత్రి సవిత
- టీడీపీ జెండా పట్టాలంటే భయపడే రోజుల్లో రవి నిలబడ్డాడు.. ఎంపీ పార్థసారథి
- పెనుకొండలో మంత్రి సవిత ఆధ్వర్యంలో పరిటాల రవి విగ్రహావిష్కరణ
- వెంకటాపురంలో ఘనంగా పరిటాల రవీంద్ర జయంతి వేడుకలు

**అంకుశం న్యూస్ అనంతపురం ఆగస్టు 30:** ఉమ్మడి అనంతపురం జిల్లా పెనుగొండ నియోజకవర్గం ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటామని తనకు రాజకీయ ఓ నామాలు నేర్పింది పెనుగొండ ప్రజలే అని మాజీ మంత్రి పెనుగొండ శాసనసభ్యులు పరిటాల సునీత అన్నారుపెనుకొండ అంటే పరిటాల రవి.. పరిటాల రవి అంటే పెనుకొండ అని.. ఈ ప్రాంత ప్రజలను ఊపిరి ఉన్నంతవరకు మరచిపోమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. పెనుకొండ నియోజకవర్గ కేంద్రంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో పరిటాల రవీంద్ర విగ్రహావిష్కరణ వేలాదిమంది అభిమానులనడుమ జరిగింది. పెనుకొండ నియోజకవర్గానికి వచ్చిన ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్, కుటుంబ సభ్యులకు అభిమానులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు, మడకశిర ఎమ్మెల్యే రాజుతో పాటు ఎంపీ పార్థసారథి ఇతర టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు వేల సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ... పెనుకొండ నియోజకవర్గానికి తమకు విడదీయరాని బంధం ఉందని అన్నారు. ఆరోజు పరిటాల రవీంద్ర రాజకీయ ప్రస్థానాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారని గుర్తు చేశారు. ప్రతిరోజు సూర్యుడు ఉదయించి అస్తమిస్తాడని.... కానీ పరిటాల రవీంద్ర అస్తమించని సూర్యుడు అని కవి చెప్పిన మాటలను గుర్తు చేశాడు. తాను పరిటాల రవిని పెనుకొండలో ఎప్పుడు చూడలేదని కానీ ఇప్పుడు ఈ విగ్రహావిష్కరణ చేసిన తర్వాత ప్రతిరోజూ చూసే అవకాశం లభించింది అన్నారు. ఈ అవకాశం కల్పించిన మంత్రి సవితకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఆరోజు మీ అందరి సహకారంతో పరిటాల రవీంద్ర రాజకీయాలు నడిపారని.. ఆ తర్వాత మీ భిక్షతోనే తాము కూడా రాజకీయాలు చేస్తున్నామన్నారు. పరిటాల రవి హత్య తర్వాత పరిటాల సునీత రాజకీయ అరంగేట్రం సమయంలో డబ్బుల సంచులు తీసుకొచ్చినా.. కొడవళ్ళతో బెదిరించినా... ఏడు మంది తుపాకుల తూటాలకు బలైనా... ఇక్కడి ప్రజలు ఆమెను ముందుకు నడిపించారన్నారు. అలాంటి ఈ ప్రజలను తాము ఊపిరి ఉన్నంత వరకు మరిచిపోమని శ్రీరామ్ స్పష్టం చేశారు.

**పెనుకొండ వాసులే నాతో రాజకీయ ఓనమాలు దిద్దించారు.. ఎమ్మెల్యే సునీత**

పరిటాల సునీత మాట్లాడుతూ పెనుకొండ అంటే తమ సొంత నియోజకవర్గంలాంటిదని... ఈ ప్రాంత ప్రజలు మా కుటుంబ సభ్యులు లాంటి వారని అన్నారు. నాకు రాజకీయ ఓనమాలు దిద్దిన వారు కూడా ఈ ప్రాంత ప్రజలేనన్నారు. మైకు పట్టుకుని ఒక నిమిషం మాట్లాడటానికి కూడా రాని తనకు గంటసేపు మాట్లాడే ధైర్యాన్ని ఇచ్చింది కూడా వీరేనన్నారు. పరిటాల రవి మరణం తర్వాత తనని రాజకీయాల్లోకి రావాలని అభిమానులు కోరారని.. అయితే ఆరోజు పోలీసుల తుపాకుల తూటాలకు 7 మంది ప్రాణాలు కోల్పోవడం చూసి తన మనసు చలించిందన్నారు. రక్తపు మడుగులో వెళ్లి నామినేషన్ వేశారన్నారు. ఆరోజు రాజకీయాల్లో వెనక్కి వద్దామని ఆలోచించానని.. కానీ మా కుటుంబాన్ని నమ్ముకున్న వేలాది మంది అభిమానుల కోసం ముందుకు నడిచానన్నారు. దీనికంతటికీ కారణం పెనుకొండ ప్రజలేనన్నారు. ఆరోజు డబ్బులు సంచులు తీసుకుని ఒక మంత్రి వచ్చి ప్రలోభ పెట్టిన ఇక్కడ ప్రజలు లొంగలేదన్నారు. అలాంటి పెనుకొండలో పరిటాల రవి విగ్రహం ఏర్పాటు చేయడం జీవితంలో మర్చిపోలేనని... విగ్రహ ఏర్పాటుకు ముందుకు వచ్చిన మంత్రి సవితను జీవితాంతం గుర్తుంచుకుంటామన్నారు. పెనుకొండ ప్రజలకు ఏ కష్టం వచ్చినా.. తాను ముందు నిలబడుతామని స్పష్టం చేశారు.

బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి పరిటాల రవి.. మంత్రి సవిత పరిటాల రవి జీవితం మొత్తం పేద వర్గాల పక్షాన నిలబడ్డారని మంత్రి సవిత అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అన్న ఎన్టీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. ఆయన బాటలో నడిచిన పరిటాల రవి పేదల బాగు కోసం తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. వెనుకబడిన అనంతపురం జిల్లా అభివృద్ధి కోసం రవన్న చేసిన సేవలు మరువలేనివన్నారు. పరిటాల రవి బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. పేదల గుండెల్లో రవన్న చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. సమ సమాజ నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలు భావి తరాలకు తెలియజేయాలన్న సంకల్పంతో పెనుకొండలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆ మహనీయుడి కాంస్య విగ్రహం ఏర్పాటుతో తన జీవితం ధన్యమైందన్నారు. తన కుటుంబానికి, పరిటాల రవి కుటుంబానికి సత్సంబంధాలున్నాయన్నారు. తన రాజకీయ అరంగేట్రం రవన్న సూచన, స్ఫూర్తితోనే జరిగిందన్నారు. పరిటాల రవి చూపిన దారిలోనే ఆయన సతీమణి, ఎమ్మెల్యే సునీత, తనయుడు శ్రీరామ్ పనిచేస్తూ, పేదల అభ్యున్నతి కోసం రేయింబవళ్లు కృషి చేస్తున్నారని మంత్రి సవిత కొనియాడారు.

**దౌర్జన్యం రాజ్యమేలుతున్న సమయంలో రవి వచ్చారు.. ఎంపీ పార్థసారథి**

పెనుకొండ, ధర్మవరం ప్రాంతాల్లో అరాచకాలు, దౌర్జన్యాలు రాజ్యమేలుతున్న సమయంలో పరిటాల రవి రాజకీయాల్లోకి వచ్చారని ఎంపీ పార్థసారథి అన్నారు. అప్పట్లో రామచంద్రారెడ్డి ఎన్నికల్లో నిలబడనని చెప్పిన సమయంలో ఎన్టీఆర్ ప్రోత్సహంతో పరిటాల రవి ముందుకొచ్చారన్నారు. చెన్నారెడ్డి కుమారుల దౌర్జన్యంతో టీడీపీ జెండా పట్టుకోవాలంటేనే భయపడే వారన్నారు. అప్పుడు రవి ఎదురు నిలబడి పార్టీని గెలిపించారన్నారు. ఆతర్వాత తనని కూడా జడ్పీటీసీ నుంచి ఎమ్మెల్యే, ఎంపీ వరకు ప్రోత్సహించారన్నారు. రవిని ఈ ప్రాంత ప్రజలే కాకుండా టీడీపీ ఎప్పటికీ మరిచిపోదన్నారు. పెనుకొండలో రవి విగ్రహం ఏర్పాటు చేసినందుకు మంత్రి సవితను ఆయన అభినందించారు...

**వెంకటాపురంలో ఘనంగా పరిటాల జయంతి**

మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతి వేడుకలు రామగిరి మండలం వెంకటాపురంలోని పరిటాల ఘాట్ వద్ద ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే పరిటాల సునీత ధర్మవరం టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ తో పాటు ఇతర కుటుంబ సభ్యులు పరిటాల ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. ఘాట్ వద్ద పరిటాల రవికి ఇష్టమైన ఆహారాన్ని పెట్టారు. కాసేపు మౌనం పాటించారు. పరిటాల రవి బ్రతికిన రోజులను గుర్తు చేసుకొని కుటుంబ సభ్యులు ఉద్వేగానికి గురయ్యారు. ఆ తర్వాత గ్రామంలో ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అక్కడ అభిమానులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి పరిటాల ఘాటు వద్ద ఘనంగా నివాళులర్పించారు. పరిటాల రవి మరణించి 20 ఏళ్లు గడిచి%అ%నా ఇప్పటికి ఈ స్థాయిలో అభిమానిస్తున్నారంటే... ఆయన చేసిన సేవా కార్యక్రమాలు, పోరాటాలే కారణమని ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ అన్నారు. పరిటాల రవి ఆశయ సాధన కోసం తామంతా కృషి చేస్తామని ప్రాంతంలో నీటి సమస్య లేకుండా చేయడమే తన లక్ష్యమన్నారు. అభిమానులు జై పరిటాల రవి, జోహార్ పరిటాల రవి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## కుప్పం ప్రాంత అభివృద్ధి కోసం 6 ఎంఓయూలు

- సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థలు





**(అంకుశం, కుప్పం, ఆగస్టు 30):** కుప్పం ప్రాంత అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు సమక్షంలో శనివారం 6 ఎంఓయూలు కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగానే కుప్పం పరిధిలో వ్యర్థాల నుంచి సంపద కార్యక్రమం అమలు కోసం ఏజీఎస్%-% ఐటీసీతో ఒప్పందం. వ్యర్థాల సుస్థిర నిర్వహణపై ఇంటింటి ప్రచారం, పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలను 15 ఏళ్ల పాటు నిర్వహించేలా ఒప్పందం. కుప్పంలో మహిళా పారిశ్రామికవేత్తలను తయారుచేయటం, మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులకు గ్రామీణ ప్రాంతాల్లో మార్కెటింగ్ అంశాలపై షీలీడ్స్ సంస్థతో ఒప్పందం. కుప్పం నియోజకవర్గంలో 10వేల మంది మహిళల్ని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయటంతో పాటు గ్రామీణ మార్కెట్లను అందిపుచ్చుకునేలా శిక్షణ ఇచ్చేందుకు ఎంఓయూ. కుప్పంలో ఫైబర్ బోర్డు ఉత్పత్తి కోసం కింగ్స్ వుడ్ డెకార్ ప్రైవేట్ లిమిటెడ్ తో ఎంఓయూ. ఈ యూనిట్ ఏర్పాటుతో 2012 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు. కుప్పంలో 2 సీటర్ ట్రైనింగ్ ఎయిర్ క్రాఫ్ట్ తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు ఒప్పందం చేసిన పయనీర్ క్లీన్ యాంప్స్ లిమిటెడ్. రూ.150 కోట్ల పెట్టుబడితో ఏడాదికి 70 నుంచి 100 శిక్షణకు ఉపయోగించే 2 సీటర్ విమానాలను తయారు చేయనున్న పయనీర్ యాంప్స్ లిమిటెడ్. మొత్తం 250 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్న పయనీర్ క్లీన్ యాంప్స్ లిమిటెడ్. బెంగుళూరుకు చెందిన స్పేస్ టెక్నాలజీ సంస్థ ఎత్రెయాల్ ఎక్స్ ప్లోరేషన్ గిల్డ్ సంస్థతో అవగాహనా ఒప్పందం. మీడియం లిఫ్ట్ లాంచింగ్ రాకెట్ రేజర్ క్రెస్ట్ ఎంకె%-%1 తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం అవగాహనా ఒప్పందం చేసుకున్న ఎత్రెయాల్. రూ. 500 కోట్ల పెట్టుబడిని మూడు దశల్లో పెట్టేలా కార్యాచరణ, మొత్తం 500 మందికి ఉద్యోగ అవకాశాలు. అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ హబ్ ఏర్పాటు చేసేందుకు రెడ్ బెర్రీ ఫుడ్ లాజిస్టిక్స్ తో ఒప్పందం. రూ.300 కోట్ల పెట్టుబడితో 15 వేల మందికి ఉపాధి కల్పించేలా ప్రతిపాదన సమర్పించిన రెడ్ బెర్రి ఫుడ్ లాజిస్టిక్స్ సంస్థ. మామిడి, జామ, టమాటో పల్పింగ్ యూనిట్లను రెడ్ బెర్రీ ఫుడ్ లాజిస్టిక్స్ను ఏర్పాటు చేయనుంది.

## గణేష్ నిమజ్జనంలో అవాంఛనీయ ఘటనలు, అపశృతులు లేకుండా ఉండాలి

- అనంతపురం నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



**అంకుశం న్యూస్ అనంతపురం ఆగస్టు 30:** పోలీసు నిబంధనలు పాటిస్తూ వినాయక నిమజ్జనంలో పాల్గొనాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. ఆదివారం నగరంలో వినాయక నిమజ్జనం జరుగుతున్న నేపథ్యంలో మండపాల నిర్వాహకులకు, ప్రజలకు పలు అంశాలపై విజ్ఞప్తి చేశారు. నగరంలో జరిగే శోభాయాత్రను ప్రజలంతా వీక్షించే విధంగా పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారన్నారు. మండపాల నిర్వాహకులు కచ్చితంగా పోలీసులు నిబంధనలు పాటించాలన్నారు. పోలీసులు, ఇతర అధికారులు నిర్ణయించిన విధంగా రాచానపల్లి, పంపనూరు సమీపంలో విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు. ఊరేగింపులో ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా నిర్వాహకులు చూసుకోవాలన్నారు. డీజేలు ఇతర వాటి విషయంలో పోలీసులు సూచనలు పాటించాలన్నారు. నిమజ్జనం సమయంలో కాలువ వద్ద పిల్లలు, వృద్ధులు లేకుండా చేసుకోవాలన్నారు. అలాగే పోలీసులు సూచించిన సమయంలోనే నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు, అపశృతులకు పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని.. అలాగే ప్రజలు కూడా ఇందుకు సహకరించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## తిరుప్పావై ఉపన్యాసాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

**అంకుశం న్యూస్ తిరుపతి ఆగస్టు 30:** పవిత్రమైన ధనుర్మాసంలో 2025 డిసెంబరు 16 నుంచి 2026 జనవరి 14వ తేదీ వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో తిరుప్పావై ఉపన్యాసాలు చేసేందుకు సమర్థులైన శ్రీవైష్ణవ సిద్ధాంతం తెలిసిన పండితుల నుంచి దరఖాస్తులు, అంగీకార పత్రాలను టిటిడి ఆహ్వానిస్తోంది. టిటిడి ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతి ఏటా ధనుర్మాసంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో తిరుప్పావై ఉపన్యాసాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అర్హులైనవారు ఈ ఏడాది సెప్టెంబరు 1 నుండి 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు "ప్రత్యేకాధికారి, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు, శ్వేత భవనం, టిటిడి, తిరుపతి" అనే చిరునామాకు దరఖాస్తులు, అంగీకార పత్రాలు పంపాల్సి ఉంటుంది. అంగీకార పత్రాలు ఇచ్చే పండితుల పట్టికతోపాటు, షరతులు, దరఖాస్తులను www.tirumala.org వెబ్సైట్ నుంచి పొందొచ్చు. ఇతర వివరాలకు టిటిడి ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు కార్యాలయాన్ని సెల్ : 9676120226, 8978734947 నంబర్ల ద్వారా సంప్రదించగలరు.

## ఆకుపాటి సారధ్యంలో గణనాథుని మండపం వద్ద పసుపులేటి వీరయ్య దంపతుల అన్న ప్రసాద వితరణ

**కనిగిరి ఆగస్టు 30 అంకుశం న్యూస్ :**కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణ టిడిపి నాయకులు, మండల రెండవ ఎంపీటీసీ, ప్రకాశం జిల్లా ఎంపీటీసీ ల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ నివాసం వద్ద ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద శనివారం పసుపులేటి వీరయ్య దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి పట్టణంలోని ప్రముఖులు పాల్గొని ప్రజలందరికీ విఘ్నాలు తొలగిపోయి కొత్త ఆశలు, ఆశయాలతో వర్ధిల్లాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆకుపాటి రమణయ్య,బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి కొండిశెట్టి వెంకట రమణయ్య, ప్రముఖ బిల్డర్ పువ్వాడి వెంకటేశ్వర్లు, హాస్పిటల్ డైరెక్టర్ నరసింగు సాంబశివరావు, పామూరు నీటి సంఘం చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, గద్దె సుధాకర్, చలివేంద్రం సుబ్బారావు, షేక్ ఖాజ రహమతుల్లా, వాయునేని రాఘవ తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.



